## ఆన్మాండ్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి


వినతి పత్రం అందిస్తున్న కార్మికులు

**హుస్నాబాద్,మే26,ప్రభాతవార్త** సిద్దిపేట సర్కిల్ హుస్నాబాద్ డివిజన్‌లో విద్యుత్ సంస్థలో విధులు నిర్వహిస్తున్న ఆన్మాండ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి హరీష్ ఆధ్వర్యంలో హుస్నాబాద్ డిఈ కార్యాలయంలో వినతి పత్రం అందించినట్లు కార్మికులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యలన్నిటిని పరిష్కరించాలనే డిమాండ్‌తో టిఎస్‌యూఈఈయూ-సిఐటియూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ వినతి పత్రం అందించినట్లు సూచించారు. వినతి పత్రం అందించిన వారిలో నాయకులు రమేష్, సదయ్య, సురేష్, సుమణ్, ఎల్లయ్య, గణేష్, రాజు తదితరులు ఉన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## గంజాయి విక్రయించడానికి వచ్చిన వ్యక్తి అరెస్ట్


వివరాలు తెలుపుతున్న ఎస్ఐ శివకుమార్

**వర్గల్, మే 26 (ప్రభాతవార్త):** హైద్రాబాద్‌లోని దూల్‌పేట్‌లో గల మంగల్‌హాట్‌కు చెందిన ఉమేష్‌సింగ్ అనే వ్యక్తి హైద్రాబాద్ నుండి గంజాయి తీసుకువచ్చి గౌరారంలో విక్రయించడానికి ప్రయత్నించగా నమ్మదగిన సమాచారం మేరకు గౌరారం ఎస్ఐ జె.శివకుమార్ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివకుమార్ మాట్లాడుతూ హైద్రాబాద్ నుండి ఉమేష్ సింగ్ అనే వ్యక్తి గంజాయి విక్రయించేందుకు వస్తున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు ఈనెల 25వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు గౌరారం బస్టాండ్ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. అతని వద్ద పరిశీలించగా తన బ్యాగ్‌లో ఉన్న ప్లాస్టిక్ కవర్‌లో గంజాయి లభ్యమైందని పేర్కొన్నారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్

## ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న అదనపు కలెక్టర్

**హుస్నాబాద్,మే26,ప్రభాతవార్త** హుస్నాబాద్‌లోని శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయాన్ని పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్ ఆదివారం రోజున సతీసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు. ఆలయంలో ఏవైనా సమస్యలు ఉన్నాయా అని ఆలయ చైర్మెన్ పూదరి లక్ష్మీనారాయణను అడిగి తెలుసుకున్నారు. జాతరకు వచ్చే భక్తులకు నీటి సౌకర్యం లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్నారు. భక్తుల సౌకర్యం కోసం వెంటనే బోరు వేయించాలని బోరు వేసేందుకు, మోటర్ బిగించేందుకు ఎంత ఖర్చు అయినా తానే భరిస్తానని చెప్పారు. ప్రతీ ఏటా జరిగే ఈ జాతర నెల రోజుల పాటు జరుగుతుందని, దక్షణ భారతదేశంలోనే గొప్పగా జరిగే ఈ జాతరకు రావడం సంతోషంగా ఉందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. హుస్నాబాద్‌కు చెందిన బిడ్డగా ఈ ఆలయానికి ఎక్కడ పని చేసినా జాతరకు వచ్చి మొక్కులు చెల్లించుకుంటానని గుర్తు చేశారు. అమ్మవారిని దర్శించుకు న్న వారిలో ఆలయ చైర్మెన్ పూదరి లక్ష్మీనారాయణగౌడ్‌తో పాటు తదితరు లు పాల్గొన్నారు.

## నేటి నుంచి నీలకంఠేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాలు


విలేకరులతో మాట్లాడుతున్న నీలకంఠేశ్వర సమాజం నాయకులు

**సిద్ధిపేట రూరల్, మే 26, ప్రభాతవార్త :** సిద్ధిపేట నీలకంఠ సమాజం అధ్వర్యంలో ఈనెల 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు గౌరీ సహిత నీలకంఠేశ్వర స్వామి కళ్యాణోత్సవం నిర్వహించడానికి నిర్వహకులు తగు ఏర్పాట్లు చేశారు. ఈనెల 27న సోమవారం సుప్రభాత, గణపతి పూజ, వీరభద్రేశ్వర స్వామి ప్రస్తాయమం, 28న రథ ప్రతిష్ట మహోత్సవం, 29న గౌరీ సహిత నీలకంఠేశ్వర స్వామి కళ్యాణోత్సవం నిర్వహించడం జరుగుతుందని నీలకంఠేశ్వర సమాజం అధ్యక్షులు గుండ్ల యోగేశ్వర్, గౌరవాధ్యక్షులు కడవెర్గు నర్సింలు, ప్రదాన కార్యదర్శి సురేష్, కోశాధికారి శ్రీకాంత్, ప్రచార కార్యదర్శి కడవెర్గు రాజు, ఉపాధ్యక్షులు తెలిపారు. కళ్యాణ మహోత్సవానికి మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావుతో పాటు సిద్ధిపేట మున్సిపల్ చైర్మన్ కడవెర్గు మంజుల రాజనర్సులు హాజరవుతున్నట్లు తెలిపారు. కళ్యాణ మహోత్సవం అనంతరం టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రం, నగదు బహుమతి అందించడం జరుగుతుందన్నారు. 33వ వార్షికోత్సవ ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడానికి తగు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వహకులు వివరించారు. కళ్యాణ మహోత్సవ ఉత్సవాలలో సిద్ధిపేట పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని నిర్వహకులు కోరారు.

## వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

### -టెలికాన్ఫరెన్స్‌లో అధికారులతో జిల్లా కలెక్టర్

సంగారెడ్డి టౌన్, మే 26, ప్రభాతవార్త: వరి ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. జిల్లాలోని జిల్లా ఆర్‌డిఓ, తహసీల్దార్‌లతో రెవిన్యూ అదనపు కలెక్టర్ మాధురి, జిల్లా అధికారులు, రెవిన్యూ అధికారులతో కలసి టెలికాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులకు పలు సూచనలు, సలహాలు అందచేశారు. ఈ సందర్బంఆంగా కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు, ధరణి అప్లికేషన్ల పరిష్కారం, ప్రజావాణి ధరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేసినట్ల పేర్కొన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యంను వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్లు తమ వద్ద ధరణి అప్లికేషన్‌లు పెండింగ్‌లో ఉండకుండా చూసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో ధరణి పరిష్కారం వివరాలు నమోదు చేయాలని, అవసరమైతే ఆయా శాఖల అధికారులను సంప్రదించాలన్నారు. నిర్ధిష్ట గడువు లోగా జిల్లాలో ధాన్యం కొనుగోలు పూర్తి కావాలన్నారు. మిల్లుల వద్ద లారీలు వెంట వెంటనే ఖాళీ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోళ్ళకు సంబంధించి కొనుగోలు కేంద్రాలలో రైసు మిల్లర్ల వద్ద డాటా ఎంట్రీ ఆన్‌లైన్ ప్రక్రయ వెంట వెంటనే పూర్తి చేసి రైతులకు సకాలంలో బిల్లులు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు.

## జెసిబి, నాలుగు ట్రాక్టర్లు సీజ్

**చిన్నశంకరంపేట,మే26,ప్రభాతవార్త:** ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక, మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు. ఆదివారం మండల పరిధి కోర్విపల్లి శివారు వద్ద రమేష్‌గౌడ్ అనే వ్యక్తి ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తుండగా పోలీసులు దాడి చేసి నాలుగు ట్రాక్టర్లు, జేసిబిని సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.


చిన్నశంకరంపేటలో పోలీసులు సీజ్ చేసిన జేసీబీ, ట్రాక్టర్లు

# హుస్నాబాద్‌లో మట్టి మాఫియా...!?

### అక్రమార్కుల ఇష్టారాజ్యం.. విచ్చల విడిగా తవ్వకాలు..చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికార యంత్రాంగం


జిల్లెలగడ్డ గ్రామంలో గుట్టను అక్రమంగా తవ్వి మట్టిని తరలిస్తున్న దృశ్యం

**హుస్నాబాద్,మే26,ప్రభాతవార్త** అనుమతులు లేవు.. అడిగే నాధుడు లేడు..ఇంకేముంది గుట్టలను తవ్వేస్తున్నారు. లక్షలు విలువ చేసే మట్టిని దోచుకెళ్తున్నారు. ఇలా అక్రమార్కులకు మట్టి వ్యాపారం గత కొద్ది రోజులు గా కాసుల వర్షం కురిపిస్తుండగా ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. హుస్నాబాద్ పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాలలో సైతం ప్రభుత్వ, ప్రయివేట్ భూముల్లో ఉదయం, రాత్రి తేడా లేకుండా జెసిబిల సహాయంతో మట్టిని వ్యవసాయానికి వినియోగించే ట్రాక్టర్ల ద్వార అక్రమంగా తరలిస్తున్నారు. ఇటీవల పట్టణ శివారులోని ఎల్లమ్మ చెరువు కట్టకు పట్టణానికి చెందిన దాదాపు 100 ట్రాక్టర్ల ద్వార లక్షల విలువ చేసే మట్టిని అక్రమార్కులు తవ్వి ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. మండలంలోని ఆయా గ్రామాల శివారు ప్రాంతాలలో మట్టి గుట్టలు ఉండడంతో కొందరు చోటా..మోటా నాయకుల అండతో ఈ దందా మూడుపువ్వులు ఆరు కాయల్లా సాగుతోంది. ప్రభుత్వ సంపదను కొల్లగొడుతున్నా నియంత్రించే నాధుడే కరువయ్యాడు.

**యథేచ్ఛగా తరలింపు...**

మట్టిని కాపాడాల్సిన మైనింగ్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ అక్రమార్కుల దందా యథేచ్ఛగా సాగుతోందని చెప్పవచ్చు. జెసిబిలు, ట్రాక్టర్లు, యంత్రాల ద్వార మట్టిని తరలిస్తూ కోట్ల రూపాయలు గడిస్తున్నారు. వాణిజ్య సముదాయాలకు, ప్రయివేట్ భవనాలకు, రియల్ వెంచర్లకు, షాపింగ్ కాంప్లెక్స్‌లతో పాటు అనేక నిర్మాణాలకు కావాల్సిన మట్టిని తరలిస్తూ ట్రాక్టర్‌కు రూ. 1వేయి నుండి 2వేల వరకు వసూళ్ల చేస్తున్నారు. ఇష్టారా జ్యంగా తవ్వకాలతో గుట్టలు మాయమౌతున్నాయి.

**అనుమతులు లేకుండానే అక్రమ తవ్వకాలు**

మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్న వ్యాపారులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే అక్రమంగా ఈదందాను సాగిస్తున్నారు. హుస్నాబాద్ పట్టణంతో పందిల్ల, పొట్లపల్లి, మడధ, నాగారం, పోతారం, జిల్లెలగడ్డ గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాలలో మట్టి గుట్టలను విచ్చలవిడిగా తవ్వకాలు చేపడుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం గుట్టల తవ్వకాలకు మైనింగ్, రెవెన్యూ శాఖలు అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఇచ్చిన అనుమతి మేరకు క్యూబిక్‌కు కొత్త మొత్తంలో డబ్బులు చెల్లించి తవ్వకాలు జరపాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ ఈ నిబంధనలు ఏవి అమలు కాకపోగా అక్రమార్కుల ఇష్టారాజ్యంగా ఎవరికి ఎప్పుడు మట్టి అవసరం వచ్చినా ఇష్టానుసారంగా తవ్వకాలు జరుసుతూ పెద్ద ఎత్తున ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకున్న పాపానపోవడం లేదు. ఏది ఏమైనా అధికారులు ఇప్పటికైనా తీరు మార్చుకుని ఈ అక్రమ తరలింపుకు అడ్డుకట్ట వేసి ప్రజా ధనం దుర్వినియోగం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.


పందిల్ల చెరువులో నుండి అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న దృశ్యం

## డిడిఎస్ ఆధ్వర్యంలో మామిడి పండ్ల ప్రదర్శన


డిడిఎస్, కెవికె ఆధ్వర్యంలో మామిడిపండ్ల ప్రదర్శన దృశ్యం

**జహీరాబాద్, మే 26, ప్రభాతవార్త:** దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డిడిఎస్), కృషి విజ్ఞాన కేంద్రం (కెవికె) ఆధ్వర్యంలో ఆదివారం కెవికె కేంద్రం ఆవరణలో మామిడిపండ్ల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. మామిడి పండ్ల ప్రదర్శనను తిలకించేందుకు హైద్రాబాద్, సంగారెడ్డి, జహీరాబాద్ ప్రాంతాల నుంచి 60 మంది రైతులు, విజిటర్లు, శాస్త్రవేత్తలు, డిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు. మామిడిపండ్ల ప్రదర్శనలో బెనిషన్, ఎర్ర మూతి, నల్ల మామిడి లాంటి అరుదైన 28 రకాల మామిడిపండ్లను ప్రదర్శించారు. ఈ సందర్బంగా కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ సైంటిస్టు సి వరప్రసాద్ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలో జహీరాబాద్ ప్రాంతంలో పాత కాలం నుంచి ఉన్న ఎన్నో పెద్ద మామిడి చెట్లు కానవచ్చాయన్నారు. అప్పట్లో నిజాం రాజులు ఎంతో ఇష్టంగా ఇక్కడి నుంచి రకరకాల మామిడి పండ్లను తెప్పించుకుని ఆరగించేవారని గుర్తు చేశారు. మార్కెట్‌లో డిమాండ్ లేదని పాత రకాల పండ్లు మునిగిపోతున్నాయని, వాటిని కాపాడుకోవడానికి జనాల మధయ అవగాహన కల్పించటానికి ఇలాంటి మామిడి పండగలను నిర్వహిస్తున్నామన్నారు. రైతు బిడకన్నె చంద్రమ్మ మాట్లాడుతూ ఒకప్పుడు ఊర్లో పలు రకాల మామిడి పండ్లు దొరికేవ అని, నేడు వాటిని మనం మర్చిపోతున్నామని, మార్కెట్‌లో కెమికల్ కొట్టిన పండ్లు తిని ఆరోగ్యం పాడు చేసుకుంటున్నామని విచారం వ్యక్తం చేశారు. పాత రకాల మామిడిపండ్ల చెట్లను రక్షించుకునేందుకు ఎవరికి వారు తమ వంతు కృషి చేయాలన్నారు. హార్టికల్చర్ శాస్త్రవేత్త కె శైలజ మాట్లాడుతూ ఆరోగ్యానికి పనికొచ్చేవి, రసాలకు పనికొచ్చేవి, పచ్చడికి పనికొచ్చేవి, వాసన ఇచ్చేఇ లాంటి ఎన్నో రకాలు ఉన్నా మనం కేవలం 4 లేదా 5 రకాలను మాత్రమే గుర్తిస్తున్నామన్నారు. ఈ సందర్బంగా వివిధ రకాల మామిడి పండ్ల వంటకాలత భోజనం ఏర్పాటు చేశారు.

## పట్టుభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

**పోలింగ్ సామాగ్రిని తీసుకొని పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లిన సిబ్బంది**
**ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్**

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టుభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఈనెల 27న నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించడానికి అధికారులు తగు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూళ్‌మిట్ట మండల కేంద్రాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు సిద్ధిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదివారం పోలింగ్ సామాగ్రిని పోలింగ్ సిబ్బందికి పంపిణీ చేశారు. పోలింగ్ నిర్వహణ కోసం ప్రిసైండింగ్ అధికారులు 6, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు 6, ఇతర పోలింగ్ అధికారులు 6 చొప్పున ఏర్పాటు చేశారు. చేర్యాల మండల కేంద్రంలో 2, కొమురవెల్లి, మద్దూరు, దూళ్‌మిట్ట మండల కేంద్రాలలో ఒకటి చొప్పున పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయా మండలాలలో 4659 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకొనున్నారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించడానికి పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ సామాగ్రిని తీసుకున్న పోలింగ్ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య అయా పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పోలింగ్‌కు సర్వ సిద్ధం చేసుకొని పోలింగ్ విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.


పోలింగ్ సామాగ్రిని తీసుకొని వెళ్తున్న సిబ్బంది

## స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచాలి

### కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి


కరపత్రం విడుదల చేస్తున్న దృశ్యం

**సిద్ధిపేట రూరల్ మే 26, ప్రభాతవార్త :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా ముందుకు వెళ్తే ఎన్నికలను అడ్డుకుంటామని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షులు రాజారాం యాదవ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో అదివారం బీసీ కుల సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కామారెడ్డి విజయభేరి సభలో కర్ణాటక సిఎం సిద్దరామయ్య చేతుల మీదుగా ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉండాలన్నారు. కులగణన, సామాజిక, న్యాయం పేరుతో అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ది పొందిన కాంగ్రెస్ మరో సారి బీసీలను మోసం చేసేందుకు సిద్దమై ందన్నారు. కులగణన చేయకుండా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా అగమేఘాల మీద స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం లేదన్నారు. వెంటనే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి కులగణన బిల్లుకు చట్టబద్ధత కల్పించి శాస్త్రీయ పద్ధతిలో కులగణన నిర్వహించాలన్నారు. కులగణన విధివిధానాల కోసం నిపుణల కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు బీహార్ రాష్ట్రాన్ని మోడల్‌గా తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కులగణన చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమైతే జూన్ 8న ఇందిరాపార్కు వద్ద వేలాది మందితో మహాధర్నా నిర్వహిస్తామన్నారు. అయినా ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్లితే జూన్ 15న బీసీ కుల సంఘాలతో కలిసి సచివాలయం ముట్టడిస్తామన్నా రు. దశాబ్దాల సామాజిక వర్గాల న్యాయమైన డిమాండ్ సాధన కోస ం తెలంగాణ తరహా మరో పోరాటానికి సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల ప్రతినిధులు శ్రీహరి యాదవ్, యాదగిరి, నరేందర్, మేకల కృష్ణ, పయ్యావుల రాములు యాదవ్, సంతోష్‌గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి,ఎమ్మెల్యేలకు కాంగ్రెస్‌పార్టీని విమర్శించే నైతికత లేదు

### ఆంజనేయులుగౌడ్, ఆవుల రాజిరెడ్డి


నర్సాపూర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు తదితరులు

**నర్సాపూర్ మే, 26. ప్రభాతవార్త :** మాజీ మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే సునీతారెడ్డి లకు కాంగ్రెస్‌పార్టీని విమర్శించే నైతికత లేదని వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి లు అన్నారు. ఆదివారం నర్సాపూర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో వారు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు విషయంలోకాంగ్రెస్ ప్రభుత్వం నిబద్దతగా పని చేస్తుందని అన్నారు. గత సీజన్‌లో కంటే వేగ వంతంగా ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఇక్కడ పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ఇతర జిల్లాలు మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాలకు పంపిస్తున్నామని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కూడ చివరి గింజ వరకు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతుల కొసం అహర్నిషలు కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్నిమాజీ మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే సునీతారెడ్డి లు వాస్తవాలు తెలుసుకోకుండా విమర్శించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వంలో రైస్‌మిల్లర్లతో కుమ్మక్కై రైతులను మోసం చేసిధాన్యం తరలింపులో బ్రోకరీజం చేస్తు రైతుల నుండి డబ్బులు వసూలు చేశారని వారు ఆరోపించారు. ఈ మేరకు మాజీ మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే సునీతారెడ్డి లకు కాంగ్రెస్ పార్టీని విమర్శించే హక్కు లేదని అలాగైతే ఊరుకునేది లేదన్నారు. వచ్చేవానాకాలం నుండి రైతు భరోసా అమలు చేస్తామని, జూలై లో ఎకరానికి 7, 500 చొప్పున పంటల పెట్టుబడి సహాయం అందిస్తామని, అలాగే అగస్టు 15 లోపు 2 లక్షల రుణమాఫీ ఖచ్చితంగా అమలు చేసి తీరుతామని వారు వెల్లడించారు. ఈకార్యక్రమంలోటిపిసిసి రాష్ట్ర నాయకులు కరుణాకర్‌రెడ్డి, సుహాసిని రెడ్డి, ఎంపిపి జ్యోతి సురేశ్‌నాయక్, మాజీ జడ్‌పిటిసీ శ్రీనివాస్‌గుప్త, మాజీ ఎంపిపి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు నవీన్‌గుప్త, గంగాధర్, వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మండల ఓబిసి సెల అధ్యక్షులు రెడ్డిపల్లి అశోక్‌గౌడ్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు అజ్మత్, యూత్ కాంగ్రెస్ నాయకులు నర్సింహ్మాచారి, దేవిసింగ్, మోహన్‌దాస్, యూత్ కాంగ్రెస్‌నాయకులు ఎన్ఎస్‌యుఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మల్లన్న స్వామి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

**కొమురవెల్లి, మే 26, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి అదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో అలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు స్వామి వారికి అభిషేకాలు, నిత్య కళ్యాణం, పట్నాలు వేసి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అక్క ఎల్లమ్మ దేవాలయంలో భక్తులు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా అలయ ఈవో బాలాజీ మాట్లాడుతూ స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, అలయ ఏఈవోలు గంగ శ్రీనివాస్, బుద్ది శ్రీనివాస్, అధికారులు అంజయ్య, మధుకర్, సందీప్, వెంకటచారి, మాధవి, సిద్దప్ప, అర్చకులు, ఒగ్గు పూజారులు తదితరులు పాల్గొన్నారు.


స్వామి వారికి పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



మల్లీశ్వరి గజల్స్ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

## బహుముఖ ప్రజ్ఞాశీలతకు నిదర్శనం మల్లీశ్వరి గజల్స్ : ఆవిష్కర్తలు

**రవీంద్రభారతి, మే 26 ప్రభాతవార్త :** సుప్రసిద్ధ గజల్స్ కవనేయిత్రి రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి రచించిన గజల్స్‌లో అద్భుత శబ్ద సౌందర్యం, పదప్రయోగం, భావుకత, కవితాత్మకత, పదచిత్రాలు, గజలియత్, రసావిష్కరణ తదితర ఎన్నో అంశాలు ఆమె బహుముఖ ప్రజ్ఞాశీలతకు నిదర్శనమని ఆదివారం రాత్రి రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ఆమె రచించిన 3 గజల్స్ పుస్తకాలను ఆవిష్కరించిన ప్రముఖులు మాట్లాడుతూ ప్రశంసించారు. సుప్రసిద్ధకవి, విమర్శకుడు, బహుగ్రంథకర్త కళారత్న డా. బిక్కి కృష్ణ సభాధ్యక్షతన భారతదేశ గజల్స్ చరిత్రలో నూతనాధ్యాయానికి నాందిపలికి ప్రపంచ రికార్డులను పొంది, గజల్ క్వీన్, గజల్ వాగ్గేయకారిణి అనిపించుకొన్న రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి ఇప్పటి వరకు రచించిన 10 గజల్స్ సంపుటాల్లోని 8, 9, 10 వలపు; కలికి; నే అనే తీయని తెలుగు గజల్స్‌ను విచ్చేసిన ప్రముఖులైన అతిథులు డా. వెనిగళ్ళ రాంబాబు, సూరారం శంకర్, మురళీధర్‌లు ఆత్మీయ అతిథులు వల్లూరి రాఘవరావు, లక్ష్మీభవాని, శ్రీదేవి జక్కా, రాధాకుసుమ తదితరులు పాల్గొని ఆవిష్కరించి మల్లీశ్వరిని ఎంతగానో అభినందించారు. ప్రముఖ గాయకులు ఎంఆర్‌కె. ప్రభాకర్, సందన్‌రాజు, లక్ష్మీభవాని, శాంతినిర్మల, భవానిరాజులు వాసిరెడ్డి మల్లీశ్వరి రచించిన గజల్లను ఆలపించి ఆహుతులకు వీనులవిందు చేశారు. చివరిగా రాజా వాసిరెడ్డి ఫౌండేషన్ అధ్యక్షురాలు, కవయిత్రి రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి తన స్పందనను తెలిపి గాయకులను ఘనంగా సన్మానించారు.

## ఏకగ్రీవంగా తిరుమలహిల్స్ కాలనీ కార్యవర్గం ఎంపిక



నూతన కార్యవర్గంను ఎంపిక చేస్తున్న కాలనీ ప్రతినిధులు

**నార్సింగి, మే 26 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని తిరుమల హిల్స్ కాలనీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గంను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా పుస్తె అవినాష్, ఉపాధ్యక్షుడిగా ఎం.భరత్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌రావ్, కోశాధికారిగా నారాయణ, సంయుక్త కార్యదర్శిగా రమణారెడ్డి, సభ్యులుగా అనిరుద్, సౌజన్యలు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు అవినాష్ మాట్లాడుతూ నాపై కాలనీ ప్రతినిధులు ఉంచిన నమ్మకంను మరింత పెంచుకునేందుకు శక్తివంచన లేకుండా పని చేస్తానని తెలిపారు. కాలనీ సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులు, ప్రజా ప్రతినిధులకు తెలిపి త్వరగా పరిష్కారమయ్యేలా చూస్తానని వివరించారు. కాలనీలో ఉన్న 1500.గజాల పార్కును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయిస్తానని, కాలనీలో మంచినీరు లోప్రెషర్‌తో వస్తుందని, ఈ సమస్యను జల మండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారిస్తామన్నారు. కాలనీ అభ్యున్నతికి సీనియర్ సిటిజెన్స్, కాలనీ పెద్దలు, కమిటీ సభ్యులందరం కలిసి సమిష్టి నిర్ణయాలు తీసుకుంటామని అవినాష్ వివరించారు. నూతన కమిటీ సభ్యులకు కాలనీ ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.

## ఆధునిక యాంత్రిక జీవనంలో 'వివాహ పరిచయ వేదిక'లకు పెరిగిన ప్రాధాన్యం

### -భూగర్భ గనుల శాఖ రాష్ట్ర డైరెక్టర్ సుశీల్‌కుమార్

**హైదరాబాద్, మే 26 ప్రభాతవార్త:** కుటుంబ వ్యవస్థ కుచించుకపోతూ ఉమ్మడి కుటుంబాలకు దురమవుతున్న నేటి ఆధునిక యాంత్రిక జీవనంలో 'వివాహ పరిచయ వేదిక'లకు ప్రాధాన్యత మరింత పెరిగిందని భూగర్భ గనుల శాఖ రాష్ట్ర డైరెక్టర్ బిఆర్‌వి.సుశీల్‌కుమార్ అభిప్రాయపడ్డారు. ఆదివారం బాగ్ అంబర్‌పేటలో బ్రాహ్మణ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ ఏర్పాటు చేసిన 'బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక'లో సుశీల్‌కుమార్ పాల్గొని ప్రసంగించారు. ఈ వివాహ వేదికలు వరంగా మారాయని, నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాలకు ఈ వేదికలు విస్తరించాయన్నారు. నేడు వివాహ పరిచయ వేదికల ద్వారానే యువతీ యువకులకు వివాహాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ వేదికలను విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షుడు బి.నీలకంఠం, ప్రధాన కార్యదర్శి డాక్టర్ వింజమూరి సుధాకర్, గౌరవ సలహాదారు, ప్రముఖ న్యాయవాది శ్రీనివాసరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు యమునా పాఠక్, సీతారామయ్య, గోపాలరావు, రఘునందన్, రవికిరణ్, రమణప్రసాద్, పీవీ.రామచందరరావు,

## విశ్వకర్మ లెజెండరీ అవార్డులు ప్రదానం



జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**చిక్కడపల్లి, మే 26 ప్రభాతవార్త:** సమాజహితం కోసం చేసే వారిని గుర్తించి పురస్కారాలను అందించడం మంచి సంప్రదాయమని నందికొండ జగద్గురు కాళహస్థ్యాచార్యా, మహాసంస్థానము జ్ఞానపీఠం పీఠాధీశ్వరులు జగద్గురు శ్రీకాంతేంద్ర స్వామి అన్నారు. ఆదివారం రాత్రి బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ 8వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాలలో విశేష ప్రతిభ కనబర్చిన వారికి 'విశ్వకర్మ లెజెండరీ అవార్డులు' ప్రదానోత్సవ కార్యక్రమం సెంటర్ వ్యవస్థాపక అధ్యక్షుడు విశ్వనాధుల పుష్పగిరి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీకాంతేంద్ర స్వామి హాజరై ఈ పురస్కారాలను అందించి గౌరవించి ప్రసంగించారు. ఇలాంటి అవార్డులు అందించడం వల్ల వారిలో మరింత ప్రోత్సాహాన్ని నింపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి, చర్లపల్లి జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ దార్ల కాళిదాస్, తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి నామోజు బాలాచారి, కార్మిక శాఖ సహాయ కమిషనర్ డాక్టర్ బి.నీలిమా కృష్ణమూర్తి, సమాచార పౌరసంబంధాల శాఖ సంయుక్త సంచాలకులు వెంకటరమణ, నెదనూరి దిలీప్ ఆచారి, తాటికొండ రంగబాబు, దరువు అంజన్న, అన్నబీమోజు జితేంద్రాచారి, గణేష్‌బాబు, విద్యాసాగర్, జితేంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ఉన్న వ్యక్తికి ఆర్థిక సాయం

**సరూర్‌నగర్, మే 26 ప్రభాతవార్త:** అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి వైద్యానికి యువజన కాంగ్రెస్ నాయకుడు అండగా నిలిచి ఆర్థిక సాయం అందించారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 26వ డివిజన్‌కు చెందిన మనోహర్ అనే వ్యక్తి తీవ్ర అనారోగ్యంతో ఉన్న విషయాన్ని తెలుసుకున్న అల్మాస్‌గూడకు చెందిన మహేశ్వరం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి ఆయనను పరామర్శించి రూ.10 వేల సాయం అందించారు. అదే విధంగా ఆయన చికిత్సకు సహాయం అందజేస్తానని కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు కొవ్వూరి రాకేష్, వినోద్ నాయక్, మధు తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు 'నామం'




### మహానగరంలో మాయగాళ్లు
### పొంచి ఉన్న ప్రమాదంలా నకిలీ ఉద్యోగాలు
### నిరుద్యోగుల పాలిట ఉచ్చు
### ధనార్జనే ధ్యేయంగా వరుస మోసాలు
### జాగ్రత్తలు చెబుతున్న పోలీసులు

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** నిరుద్యోగుల బలహీనతలను ఆసరాగా చేసుకుని వరుస ఉద్యోగ మోసాలతో చెలరేగిపోతున్నారు కేటు గాళ్ళు. మొన్న గ్రూప్-1 ఉద్యోగాల పేరుతో నగరానికి చెందిన నలుగురు సభ్యుల ముఠా పలువురికి టోకరావేయగా, నిన్నటికి నిన్న డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాల ఖాళీల పేరుతో నగరానికి చెందిన ఒక నకిలీ పోలీసు మోసాలకు పాల్పడ్డాడు. మరో కేసులో ఇంటర్వ్యూకి వచ్చిన నిరుద్యోగ యువతిపై అత్యాచారం చేయబోయిన ఘటన దుమారం రేపగా, తాజాగా జీహెచ్‌ఎంసీలో ఉద్యోగాలిప్పిస్తామని 30 మందిని ఒక వ్యక్తి మోసం చేసి డబ్బుతో ఉడాయించాడు. మరో కేసులో ఉద్యోగాల పేరుతో టోకరావేసిన కేటుగాడి నుంచి తమ డబ్బు వసూలు చేసు కోడానికి అతడి భార్యను కిడ్నాప్‌చేశారు బాధితులు. ఇవేకాక, ఒరాకిల్ వంటి సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ ఇచ్చి పెద్దసంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎస్‌ఆర్ నగర్ కళ్యాణమండపం వద్ద కొన్ని నకిలీ ఇన్‌స్టిట్యూట్‌ల నిర్వాకం గుట్టుచప్పుడు కాకుండా నడుస్తుండడంతో పోలీసులు నిఘావేశారు. వివిధ బ్యాంక్ ఉద్యోగాల గ్యారంటీ పేరుతో బేగంపేటలో నకిలీ శిక్షణా శిభిరాలు వెలవడమే కాక, అమేజాన్ వంటి మల్టీ నేషనల్ కంపెనీల్లో ప్రైవేట్ ఉద్యోగాల పేరుతో ఇంటర్వ్యూలు చేసి డబ్బు వసూలు చేసే నకిలీ కార్యాలయాలు కూడా పలు ప్రాంతాల్లో వెలిశాయి. మరోపక్క నిరుద్యోగులను విదేశాలకు విక్రయించే ఏజెంట్లు మాటువేశారు. మోసంచేయడమే ఉద్యోగంగా మార్చి ఎందరో నిరుద్యోగులను ట్రాప్ చేసి విదేశాలకు అక్రమ రవాణాగా తరలిస్తున్న ఏజెంట్లను పోలీసులు అరెస్ట్ చేయడంతో చదువు పూర్తి చేసుకుని ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్న సామాన్యులు ప్రముఖ సంస్థల నుంచి ఉద్యోగాల ప్రకటనలు చూసినా దరఖాస్తు చేసుకోవడానికి జంకుతున్నారు.

**విద్యార్థుల వివరాలతో ఫైనాన్స్ కంపెనీకి నామం:**

ఇటీవల శిక్షణ ఇచ్చి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి నగరానికి చెందిన ఒక ప్రైవేటు సంస్థ బోర్డు తిప్పేయడమేకాక, విద్యార్థుల పేరుతో ఫైనాన్స్ కంపెనీల్లో రుణాలు తీసుకుని పరారైన విషయం తాజాగా చోటుచేసుకుంది. కుంచం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ పేరుతో నిర్వాహకులు ఒక సంస్థను నెలకొల్పారు. వారి ప్రకటనలో సాఫ్ట్‌వేర్ శిక్షణ వివరాలకు ఆకర్షింపబడిన విద్యార్థులు పెద్ద ఎత్తున అందులో చేరారు. విద్యార్థులు ఒక్కొక్కరి నుంచీ భారీగా రిజిస్ట్రేషన్ ఋసుము వసూలు చేసిన నిర్వహకులు, వాదందరి వివరాలూ తమ వద్ద ఉండడంతో వారందరిలోనూ ఒక్కొక్కరి పేరుతో పలు ఫైనాన్స్ కంపెనీల్లో సుమారు రూ.4లక్షలు రుణం తీసుకున్నారు.

ఈ సంస్థ బోర్డు తిప్పేయడం తో ఆయా ఫైనాన్స్ సంస్థలు తమ రుణం కట్టాలని అమాయకులైన విద్యార్థులకు ఫోన్లు చేసి ఒత్తిడి తెస్తున్నాయి. దాంతో మోసపోయిన విద్యార్థులందరూ తెలంగాణ మహిళా సంక్షేమ మంత్రి దాసరి అనసూయ సహాయంతో నగర పోలీసు శాఖకు వరుస ఫిర్యాదులుచేశారు. ఈమేరకు కేసులు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అంతే కాకుండా విద్యార్థులకు శిక్షణ ఇచ్చే పలు ప్రైవేటు సంస్థలపై నిఘా పెట్టారు.

**డేటా ఎంట్రీ అయితే నమ్మొద్దు:**

ఉద్యోగాల పేరుతో జరిగే మోసపూరితమైన ప్రకటనలను కొత్తగా చదువు పూర్తి చేసుకుని బయటకొచ్చిన విద్యార్థులు పలు విధాలుగా గుర్తించవచ్చని పోలీసు శాఖ తెలిపింది. కాలేజి చదువు ముగించి బయటకు వచ్చే విద్యార్థులు చాలా మందికి ఉద్యోగవేటలో జరిగే అనర్థాలు, మోసాలు తెలియని కారణంగా విధ విధాలుగా నష్టపోతున్నారని, వీరికి కెరీర్‌పై అవగాహన కల్పించాల్సిన బాధ్యత కాలేజి యాజమాన్యంలో ప్రతీ ఉపాధ్యాయులకి ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు విదేశీ ఉద్యోగాపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతో ఉందని తెలిపారు. కేవలం చదువుకున్న చదువుకు, లేదా అర్హత సంపాదించిన కోర్సుకు చెందిన ప్రొఫెషనల్ ఉద్యోగాలకు మాత్రమే విదేశాల్లో దరఖాస్తు చేసుకోమని, డేటా ఎంట్రీ ఆపరేటర్ పేరుతో విదేశాల్లో ఉద్యోగావకాశాలు ఉంటే వాటిని నమ్మవద్దని పోలీసులు చెబుతున్నారు. ప్రొఫెషనల్ ఉద్యోగాలకైతే పేరున్న సంస్థల నుంచి నిర్దిష్టమైన వివరాలతో కంపెనీ ప్రొఫైల్, జాబ్ ప్రొఫైళ్లు ఉంటాయని, ఉద్యోగాల సెలెక్షన్‌లో భాగంగా అభ్యర్థిని ఆ సబ్జెక్టుకు చెందిన పరిజ్ఞానంతో కూడిన ప్రశ్నలను టెలిఫోనిక్ ఇంటర్వ్యూలలోనూ, ఫేస్ టు ఫేస్ ఇంటర్వ్యూలలోనూ అడుగుతారని తద్వారా అవి మోసపూరితమైన ప్రకటనలు కావని నిరుద్యోగులు గుర్తించవచ్చన్నారు. అంతే కాకుండా ఉద్యోగం ఇచ్చే వారు తమ వద్ద చేరి పని చేసిన అభ్యర్థులకు జీతాలిస్తారు గానీ, ఐడీ కార్డుకు కొంత రుసుము, ఆఫర్ లెటర్‌కు మరికొంత రుసుము, ఇంటర్వ్యూ చేసినందుకు ప్రత్యేక రిజిస్ట్రేషన్ రుసుము తీసుకోరని తెలిపారు. అలా తీసుకుంటున్నట్లైతే అవి ఫ్రాడ్ చేసే కేటుగాళ్ళ పనిగా గుర్తించాలని పేర్కొన్నారు. కొన్ని కన్సల్టెన్సీలు ముందస్తు రుసుము తీసుకుంటాయనీ, వాటికీ నకిలీ సంస్థలకూ తేడా గమనించాలని తెలిపారు. ముఖ్యంగా హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్‌లు నిరుద్యోగులను ఇంటర్వ్యూ చేస్తారని, వారు మాట్లాడే ఇంగ్లీష్‌ను బట్టి వారు అసలైన వారా లేక మోసగాళ్ళా అనేది తెలిపోతుందని చెప్పారు. మోసగాళ్ళలో సరిగ్గా కమ్యూనికేషన్ స్కిల్స్ లేని వారు ఉంటారని, ఏమాత్రం సందేహం ఉన్నా వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు 1 9 3 0 టోల్‌ఫ్రీ నెంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేయవల్సిందిగా పోలీసులు తెలియజేశారు.

## మోడీతోనే దేశం అభివృద్ధి : మన్నె ఆంజనేయులు

**రాయపోల్ మే26 ప్రభాతవార్త** ప్రధాని నరేంద్రమోడీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని బిజెపి మండల నాయకులు మన్నె ఆంజనేయులు అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం రాయపోల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నిక ల్లో ప్రధాని నరేంద్ర మోడీ ముచ్చటగా మూడవసారి కేంద్రంలో అధికారం లోకి రావడం ఖాయమని ఆయన అన్నారు.దేశం అభివృద్ధి చెందటాంటే ప్రధాని నరేంద్ర మోడీ సాధ్యమని అన్నారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకా లతో దేశ ప్రజలు మరోసారి ప్రధానిగా నరేంద్ర మోడీకే భారీ మెజార్టీ ఇవ్వబోతున్నారని ఆయన అన్నారు.ఉగ్రవాదం, దేశ రక్షణ, అంతర్గత భద్రతకు బిజెపి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు.మెదక్ ఎంపీగామాధ వనేని రఘునందన్‌రావు భారీ మెజార్టీతో గెలువబోతున్నారని ఆయన అన్నారు

## గౌరవెల్లిలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**అక్కన్నపేట,మే26,ప్రభాతవార్త** మండలంలోని గౌరవెల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు.ఈ సందర్భంగా వారికి విద్యా బుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.అనంతరం విద్యార్థులు తమ చిన్న నాటి చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లారెడ్డి, మోహన్‌రావు,లక్ష్మీనారాయణ,నారాయణరెడ్డి,రాజేశం,లక్ష్మారెడ్డి,కనుకయ్య,శంకర్,వెంకట్‌రెడ్డి,శకుంతల,శ్రీనివాస్,లింగారెడ్డి, మోహన్, శ్రీనివాస్,సంపత్, పరమేష్,విజయ్‌కుమార్‌తో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## స్థానికేతరుల పాలన వల్లే అభివృద్ధికి నోచుకోని ఎల్లమ్మ దేవాలమం

### బిజెపి కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి

**హుస్నాబాద్,మే26,ప్రభాతవార్త** దక్షణ భారతదేశంలోనే గొప్పగా జరిగే జాతర శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి జాతర అని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రోజున ఎల్లమ్మతల్లిని దర్శించుకున్న ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం మాట్లాడుతూ ఇంత గొప్ప మహిమ గల దేవాలయం హుస్నాబాద్‌లో ఉండడం ఈ ప్రాంత ప్రజల అదృష్టంగా భావిస్తున్నామన్నారు.ఈ ప్రాంత ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.మహిమ గల గొప్ప అమ్మవారి దేవాలయం స్థానికేతరుల పాలన వల్లే అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతీ సంవత్సరం మే నుండి జూన్ అంటే నెల రోజుల వరకు జరిగే ఈ దేవాలయంలో భక్తులకు కనీస సౌకర్యాలు లేవడం బాదాకరమైన విషయమన్నారు.రానున్న రోజుల్లో ఆలయ అభివృద్ధికి కేంద్రం నుండి నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు.అంతే కాకుండా దేవాలయానికి తన సహకారం ఎప్పటికీ అందిస్తానని హామీ ఇచ్చారు.

## లలితక్క విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలి

**హుస్నాబాద్,మే26,ప్రభాతవార్త** బెల్లి లలితక్క విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని హుస్నాబాద్ జాయింట్ యాక్షన్ కమిటి నియోజకవర్గ కో కన్వీనర్ మ్యాకల వీరన్న యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం లలితక్క 25వ వర్ధంతి కార్యక్రమాన్ని మండలంలోని మీర్జాపూర్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఉద్యమ వ్యతిరేకులు బెల్లి లితక్కను 17 ముక్కలుగా నిరికి గోనె సంచిలో కట్టి చెరువుకుంటలో పడేసిన విషయాన్ని గుర్తు చేశారు.కార్మికురాలిగా పని చేసిన లలితక్క కార్మిక,మహిళా సమస్యలపై ఎన్నో పోరాటాలు నిర్వహించిందని,ఫ్లోరైట్ సమస్యపై ప్రజలను చైతన్యం చేయడంతో పాటు వైశ్య వృత్తిలో ఉన్న మహిళలను ఆనరకం నుండి విడిపించిందన్నారు.తెలంగాణ జనసభ ఆధ్వర్యంలో తెలంగాణ కళాసమితికి కోకన్వీనర్‌గా ఉండి ఉద్యమాలు నిర్వహించిన విషయాలను గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో జెఎసి బాధ్యులు ఇల్లందుల లక్ష్మణ్‌గౌడ్,గొర్ల వీరన్నయాదవ్,నరసింహ్,రమేష్,సంపత్,శ్రీనివాస్,దిలీప్ పాల్గొన్నారు.

## డిసిఎంలోని గడ్డికి మంటలు

**చిన్నశంకరంపేట,మే26,ప్రభాతవార్త:** మండల పరిధి మదూరులో ఆదివారం ప్రమాదవశాత్తు విద్యుత్తుతీగలు తగిలి డీసీఎంలోని గడ్డికి మంటలు వ్యాపించాయి. అంబాజిపేటకు చెందిన నర్సింలు మదురూ రైతుల వద్ద నుండి గడ్డిని సేకరించి తన డీసీఎంలో తరలిస్తున్నాడు. ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగలు గడ్డికి తగిలి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. గమనించిన రైతులు వెంటనే రామాయంపేట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు వచ్చి మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. సుమారు 1లక్ష రూపాయాల నష్టం వాటిలిందని నర్సింలు వాపోయాడు.



జూబ్లీహిల్స్‌లోని జెఆర్‌సి కన్వెన్షన్‌లో జరిగిన డయాబిటిస్ ఎక్స్‌పో-2024ని ప్రారంభించిన సుప్రీంకోర్టు మాజీ చీఫ్‌జస్టిస్ ఎన్.వి.రమణ

### పాఠశాలల పునః ప్రారంభానికి ముందే

# గురుకులాల్లో బదలీలు, ప్రమోషన్లు చేపట్టాలి

### గురుకుల జెఏసి సమావేశంలో తీర్మానం

**ఎల్‌బినగర్, మే 26 ప్రభాతవార్త:** ఎల్‌బినగర్‌లోని టిగారియా సంఘం కార్యాలయంలో ఆదివారం గురుకుల జెఏసి సమావేశం నిర్వహించారు. సమావేశానికి సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, మైనార్టీ, జనరల్ గురుకులాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. గురుకులాలన్నింటికి కామన్ అడ్మినిస్ట్రేషన్ కోసం ప్రత్యేకంగా గురుకుల డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని, ప్రజాభవన్‌లో గురుకుల ఉపాధ్యాయులు ఫిబ్రవరిలో ఆందోళన చేసిన సమయంలో జెఏసికి ఇచ్చిన హామీ మేరకు పాఠశాలలు పున:ప్రారంభం కావడానికి ముందే జిఓ 317 బదిలీలు పూర్తి చేసి ప్రమోషన్స్ ఇవ్వాలని, సాధారణ బదిలీలు పూర్తి చేసిన తర్వాతే నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు పోస్టింగ్స్ ఇవ్వాలని, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా విద్యార్థుల డైట్ ఛార్జీలను పాఠశాలలు ప్రారంభించడానికి ముందే పెంచాలని, గురుకుల ఉపాధ్యాయులకు నైట్ స్టేను తొలగించాలని, రాబోయే పిఆర్‌సిలో గురుకుల ఉపాధ్యాయులకు ప్రత్యేక వేతన స్కేలు, స్పెషల్ టీచర్స్‌కు టిజిటికి సమానమైన స్కేలు వర్తింప చేయాలని, అన్ని గురుకులాల్లో వార్డెన్ పోస్టులు భర్తీ చేసి ఉపాధ్యాయులను డిప్యూటీ వార్డెన్ బాధ్యతల నుంచి విముక్తి చేయాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల టైమింగ్స్‌ను గురుకుల డిగ్రీ కళాశాలలకు వర్తింప చేయాలని, అన్ని గురుకులాలకు ఒకే రకమైన స్టాఫ్ ప్యాటర్న్ ఉండేలా ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేయాలని, బిసి గురుకుల పాఠశాలల టైమ్‌ను 9 గంటలకు మార్చాలని సమావేశంలో తీర్మానం చేశారు. గురుకులాల సంఖ్యను పెంచినప్పటికీ సరైన సదుపాయాలు కల్పించక పోవడం వల్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ సమావేశంలో అధ్యక్షులు మామిడి నారాయణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.మధుసూధన్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎం.రామకృష్ణయ్య, సంక్షేమ గురుకుల ప్రతినిధులు నర్సింహులు గౌడ్, కె.జనార్ధన్, బి.బిక్షం, గిరిజన గురుకుల ప్రతినిధులు పిఎస్ కమలాకర్, తెలంగాణ గురుకుల ప్రతినిధులు డాక్టర్ అజయ్ కుమార్, పిడిపిటి అసోసియేషన్ ప్రతినిధి ఆర్.లాలు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మ్యూజిక్ అసోసియేషన్ ప్రతినిధులు ఎ.వేదాంతచారి, బి.కౌముది, జి.రజని, ఎస్‌సి గురుకుల ప్రిన్సిపాల్ సంఘం ప్రతినిధులు ఎస్.దానం, ఎస్.దయాకర్, మైనార్టీ గురుకుల సొసైటీ ప్రతినిధి ఎం.కృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న గురుకుల జెఏసిసప్రతినిధులు



గణపతి, సిద్ధి, బుద్ధి విగ్రహాలను అందజేస్తున్న గోపాలకృష్ణ, మహాలక్ష్మి

## లక్ష్మీగణపతి దేవాలయానికి ఉత్సవ మూర్తుల విరాళం

**సరూర్‌నగర్, మే 26 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని శివసాయినగర్‌లోనున్న శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి సమేత శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయం 11వ వార్షికోత్సవం సందర్భంగా భక్తులు గోపాలకృష్ణ, మహాలక్ష్మి దంపతులు గణపతి, సిద్ధి, బుద్ధి ఉత్సవ మూర్తులను ఆలయానికి విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు విగ్రహాలను ఆలయ ఛైర్మన్ తీగల సుభాష్‌రెడ్డి చేతుల మీదుగా ఆలయ కమిటీ వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సుజిత్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, వెంకటకృష్ణారావు, వెంకటరమణ, పలువురు మహిళలు పాల్గొన్నారు.

## నందనవనంలో వాహనాల చెకింగ్

**సరూర్‌నగర్, మే 26 ప్రభాతవార్త:** రాచకొండ పోలీస్ కమిషనరేట్ మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నందనవనం వద్ద పోలీసులు వాహనాల చెకింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో డిఐ గౌరీనాయుడు, ఎస్ఐ సుధాకర్, వెంకటరాంరెడ్డిలు సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఈ మేరకు నెంబర్ ప్లేట్ లేని వాహనాలను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకొని విచారణ చేస్తున్నారు.

## సుధీర్‌కుమార్‌కు ఘన నివాళులు



సుదీర్‌కుమార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన దృశ్యం

**చిక్కడపల్లి, మే 26 ప్రభాతవార్త:** యువజన కాంగ్రెస్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు పి.సుధీర్‌కుమార్ 22వ జయంతి కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆ మహనీయుడి విగ్రహానికి సుధీర్‌కుమార్ కుమార్తె రమ్యాతేజ, కుమారుడు శశిసుధీర్, అల్లుడు సుకినరెడ్డి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక నాయకులు రమేశ్ గౌడ్, శ్రీనివాస్‌నాయుడు, వినోద్, రంగినేని శ్రీనివాస్ తదితరులు సుదీర్ కుమార్ అభిమానులు పాల్గొన్నారు. అనంతరం నీలోఫర్ హాస్పిటల్, బసవతారకం హాస్పిటల్ వద్ద కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు.

## మణికొండలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

**నార్సింగి, మే 26 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని స్వర్ణదేవాలయం వద్ద విఆర్‌ఫర్‌యు సంస్థ ప్రతినిధులు ఆదివారం ప్రయాణీకులకు చల్లటి మజ్జిగ పాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎండ వేడిమి నుంచి తట్టుకునేందుకు చల్లటి మజ్జిగ పాకెట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. విఆర్‌ఫర్‌యు సంస్థ ప్రతినిధులు సాటి వారికి సహాయపడడంలో ఎల్లప్పుడూ ముందుంటున్నారని తెలిపారు. ఉచిత అన్నదానాలు, ఉచిత వైద్య శిబిరాలు, చలివేంద్రాల ద్వారా చల్లటి మంచినీరు, మజ్జిగలను పంపిణీ చేసి సాటి వారికి సహాయపడాలన్న గుణానికి ప్రజలకు అలవాటు చేసేందుకు కృషి చేస్తుందన్నారు. తీసుకోవడంలో కన్న ఇవ్వడంలోనే, త్యాగంలోనే అనంతమైన సంతృప్తి లభిస్తుంటుందన్నారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఇలాంటి మంచి పనులు చేసేందుకు మరింత మంది ముందుకు రావాల్సిన అవసరం ఉందని రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఫర్‌యు సభ్యులు ప్రదీప్‌రావ్, సాంబశివరావ్, రామసుబ్బయ్య, నాగేంద్రరావ్, రంగాచారి, నాగభూషణం, కన్నయ్య, ప్రబావతి, ప్రతినిధులు మంజు అగర్వాల్, లక్ష్మణ్, కాంతారావ్, ఆరిఫ్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో కిక్కిరిసిన తునికి నల్ల పోచమ్మ ఆలయం

**కౌడిపల్లి, మే 26, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలోని మెదక్ జిల్లాలో రెండవ అతి పెద్ద జాతరగా పేరు గాంచిన తునికి శ్రీ నల్ల పోచమ్మ ఆలయం ఆదివారం నాడు భక్తులతో కిటకిటలాడింది. భక్తులు ఉదయం నుండి ఆలయం వద్ద భక్తులతో సందడిగా మారింది. ఆదివారం సెలవు దినం, వేడి తీవ్రతను సైతం లెక్కచేయకుండా ఉదయం నుండి భక్తులు, పలువురు ప్రభుత్వ ఉద్యోగస్థులు సైతం తమ కుటుంబ సమేతం తునికి శ్రీనల్ల పోచమ్మ ఆలయాన్నికి పెద్ద ఎత్తున తరలివసు_న్నారు. ఆలయ ఈఓ మోహ న్ రెడ్డి, ఆలయ చైర్మెన్ తాళ్ల శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన ఆర్చకులు శివప్పలు శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారికి పంచామృతాభిషేకం చేసి, అమ్మవారిని ప్రత్యే కంగా అలంకరించి, కుంకుమార్చన చేసిన తర్వాత భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించగా భక్తులు ఒడి బియ్యం పోసి, ప్రత్యేక పూజలు నిర వ్హిం చి, తమ మొక్కులను తీర్చుకొవడానికి పెద్ద సంఖ్యలో హాజరైనారు. భక్త లు శివసత్తుల విన్యాసాల నడుమ భక్తులు బోనాలను డప్పు చప్పులతో ఆలయం చుట్టు ఊరేగించి, భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మ వారికి బోనం నైవేద్యం సమర్పించి, జంతు బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఓ బి. మోహన్ రెడ్డి తన సిబ్బంది సహకారంతో గర్భ గుడిలోకి భక్తులకు దర్శనం కల్పించారు. అటవీ ప్రాంతంలో ఆలహాదకరమైన వాతావరణంలో వెలసిన శ్రీ నల్ల పోచమ్మ ఆలయం వద్ద ప్రతి ఆది వారం నాడు చిన్న చిన్న శుభ కారా ్యలను చేస్తుండటంతో భక్తులు రద్దీ మరింత పెరిగి పొతుం ది. ఆసలే వేసవి ఎండ తీవ్రత అధికంగా ఉండటం కారణంగా త్రాగు నీటికి ఏలాంటి ఆసౌర్యాలు కల్గకుండ భక్తులకు ఈఓ తన సిబ్బందితో నీటి సౌలభ్యతతో పాటు మౌళిక వసతులు కల్పించారు. ఈ కార ్యక్రమంలో ఆలయం జూనియర్ ఆసిస్టెంట్ వేంకట్ రెడ్డి, ఆలయ ప్రధాన ఆర్చకులు శివప్ప, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్య పాల్గొన్నారు.

## అమెరికాలో మీట్ విత్ పొన్నంకు అనూహ్య స్పందన

**హుస్నాబాద్,మే26,ప్రభాతవార్త** అమెరికాలో ఉంటున్న తెలంగాణ ప్రజల కష్ట సుఖాలు తెలుసుకునేందుకు రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అమెరికా పర్యటనలో భాగంగా ఆదివారం మీట్ విత్ పొన్నం అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. రాష్ట్రం నుండి అమెరికాకు వెళ్లి స్థిరపడిన వ్యక్తులతో పాటు ఎన్‌ఆర్‌ఐలు, వివిధ పనులు జేసుకుంటూ జీవనం సాగించే వ్యక్తులు ఎంతో మంది మంత్రిని కలిసి వారి సమస్యలు,అక్కడ వారు పడుతున్న కష్ట సుఖాలను మంత్రితో పంచుకున్నారు.ఈ నేపథ్యంలో హుస్నాబాద్ మండలంలోని పందిల్ల గ్రామానికి చెందిన బుర్ర రాజయ్య కుమారుడు గణేష్ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.అనంతరం రాష్ట్ర పరిస్థితులపై మంత్రితో చర్చించారు.

## పుల్‌కల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**పుల్‌కల్, మే 26, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన పుల్‌కల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. 2003-03 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో కలిసి చదువుకున్న విద్యార్థులు ఒక చోటకు చేరుకుని సమ్మేళనం జరుపుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరేసు కుంటూ నేటి జీవనాన్ని, పిల్లల భవిష్యత్తుపై కులసాగా చర్చించుకున్నారు. నాటి విద్యా బోధన చేసిన పూర్వ ఉపాధ్యాయులకు విద్యార్థులు శాలు వాలు, పూలమాలలు, మెమోంటోలతో ఘనంగా సత్కరించి ఆశీర్వచనాలు అందుకున్నారు.


తునికి శ్రీ నల్ల పోచమ్మ తల్లిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

## భక్తులతో కిక్కిరిసిన తునికి నల్ల పోచమ్మ ఆలయం

**కౌడిపల్లి, మే 26, ప్రభాతవార్త :** తెలంగాణ రా ష్ట్రంలోని మెదక్ జిల్లాలో రెండవ అతి పెద్ద జాతరగా పేరు గాంచిన తునికి శ్రీ నల్ల పోచమ్మ ఆలయం అదివారం నాడు భక్తులతో కిటకిటలాడింది. భక్తులు ఉదయం నుండి ఆలయం వద్ద భక్తులతో సందడిగా మారింది. ఆది వారం సెలవు దినం, వేడి తీవ్రతను సైతం లెక్కచేయకుండా ఉదయం నుండి భక్తులు, పలువురు ప్రభుత్వ ఉద్యోగస్థులు సైతం తమ కుటుంబ సమేతం తునికి శ్రీ నల్ల పోచమ్మ ఆలయాన్నికి పెద్ద ఎత్తున తరలివసు_న్నారు. ఆలయ ఈఓ మోహ న్ రెడ్డి, ఆలయ చైర్మెన్ తాళ్ల శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన అర్చకులు శివప్పలు శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారికి పంచామృతాభిషేకం చేసి, అమ్మవారిని ప్రత్యే కంగా అలంకరించి, కుంకుమార్చన చేసిన తర్వాత భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించగా భక్తులు ఒడి బియ్యం పోసి, ప్రత్యేక పూజలు నిర వ్రహిం చి, తమ మొక్కులను తీర్చుకొవడానికి పెద్ద సంఖ్యలో హాజరైనారు. భక్తు లు శివసత్తుల విన్యాసాల నడుమ భక్తులు బోనాలను దప్పు చప్పులతో ఆలయం చుట్టు ఊరేగించి, భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మ వారికి బోనం నైవేద్యం సమర్పించి, జంతు బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఓ బి. మోహన్ రెడ్డి తన సిబ్బంది సహకారంతో గర్భ గుడిలోకి భక్తులకు దర్శినం కల్పించారు. అటవీ ప్రాంతంలో ఆలహాదకరమైన వాతావరణంలో వెలసిన శ్రీ నల్ల పోచమ్మ ఆలయం వద్ద ప్రతి ఆది వారం నాడు చిన్న చిన్న శుభ కారా ్యలను చేస్తుండటంతో భక్తులు రద్దీ మరింత పెరిగి పోతుం ది. అసలే వేసవి ఎండ తీవ్రత అధికంగా ఉండటం కారణంగా త్రాగు నీటికి ఏలాంటి ఆసౌర్యాలు కల్గకుండ భక్తులకు ఈఓ తన సిబ్బందితో నీటి సౌల భ్యతతో పాటు మౌళిక వసతులు కల్పించారు. ఈ కార ్యక్రమంలో ఆలయం జూనియర్ ఆసిస్టెంట్ వేంకట్ రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు శివప్ప, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్య పాల్గొన్నారు.

## అమెరికాలో మీట్‌విత్ పొన్నంకు అనూహ్య స్పందన


పొన్నంను కలిసిన హుస్నాబాద్ ఎన్ఆర్ఐలు

**హుస్నాబాద్,మే26,ప్రభాతవార్త** అమెరికాలో ఉంటున్న తెలంగాణ ప్రజల కష్ట సుఖాలు తెలుసుకునేందుకు రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అమెరికా పర్యటనలో భాగంగా ఆదివారం మీట్ విత్ పొన్నం అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. రాష్ట్రం నుండి అమెరికాకు వెళ్లి స్థిరపడిన వ్యక్తులతో పాటు ఎన్ఆర్ఐలు, వివిధ పనులు జేసుకుంటూ జీవనం సాగించే వ్యక్తులు ఎంతో మంది మంత్రిని కలిసి వారి సమస్యలు,అక్కడ వారు పడుతున్న కష్ట సుఖాలను మంత్రితో పంచుకున్నారు.ఈ నేపథ్యంలో హుస్నాబాద్ మండలంలోని పందిల్ల గ్రామానికి చెందిన బుర్ర రాజయ్య కుమారుడు గణేష్ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.అనంతరం రాష్ట్ర పరిస్థితులపై మంత్రితో చర్చించారు.

## పుల్‌కల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మళనం


పుల్‌కల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం దృశ్యం

**పుల్‌కల్, మే 26, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన పుల్‌కల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆనందోత్స వాలతో ఘనంగా జరుపుకున్నారు. 2003-03 విద్యా సంవత్స రంలో 10వ తరగతిలో కలిసి చదువుకున్న విద్యార్థులు ఒక చోటకు చేరుకుని సమ్మేళనం జరుపుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ నేటి జీవనాన్ని, పిల్లల భవిష్యత్తుపై కులసాగా చర్చించుకున్నారు. నాటి విద్యా బోధన చేసిన పూర్వ ఉపాధ్యాయులకు విద్యార్థులు శాలువాలు, పూలమాలలు, మెమోంటోలతో ఘనంగా సత్కరించి ఆశీర్వచనాలు అందుకున్నారు.

## బాధితులకు మైరుగైన వైద్య సేవలు అందించాలి

### ఎమ్మెల్యే సునీతారెడ్డి

**నర్సాపూర్ మే, 26. ప్రభాతవార్త :** కౌడిపల్లి మండలం లింగంపల్లి తండాకు చెందిన ముత్యాలు కుటుంబీకులు ఇటీవల రాత్రి ఒక విందుకు హాజరై అస్వస్థతకు గురికాగా మొదటగా ముత్యాలుకు వాంతులు విరేచనాలు కలుగడంతో ప్రైవేటు ఆసుపత్రిలో చిరిత్స పొందుతూ ముత్యా లు మృతి చెందారు. ఈ మేరకు మృతురాలి ముత్యాలు కోడలు తేజ, కొడుకులు సంతోస్, సురేశ్ లు కూడ అస్వస్థతకు గురికాగా వీరి పరిన్థతి కూడ విషమంగా ఉండటంతో వారు నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. ఈవిషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీతా రెడ్డి ఆదివారం నర్సాపూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళి చికిత్స పొందుతున్న బాదితులను పరామర్శించి వీరికి మెరుగైన వైద్య సేవలను అందించాలని అక్కడి డాక్టర్లకు సూచించారు.అంతేగాక ఆమె ఆర్థిక సహాయాన్ని కూడ అందించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిఫల్ చైర్మన్ అశోక్‌గౌడ్, కౌడిపల్లి జడ్పిటీసి కవితాఅమర్‌సింగ్, మున్సిఫల్ వైస్ చైర్మన్ నహీమొద్దీన్, సీనియర్ నాయకులు సత్యంగౌడ్,షేక్ హుస్సెన్, తొంట వెంకటేశ్,సూరారం నర్సింలు, నాగ్సానిపల్లి ఎల్లం,రింగుల ప్రసాద్, సాయాగౌడ్, నియోజకవర్గ నాయకులు, కర్యాకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మోడీతోనే దేశం అభివృద్ధి : మన్నె ఆంజనేయులు

**రాయపోల్ మే26 ప్రభాతవార్త** ప్రధాని నరేంద్రమోడీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని బిజెపి మండల నాయకులు మన్నె ఆంజనేయులు అన్నారు. ఈ సందర్భంగా అదివారం రాయపోల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నిక ల్లో ప్రధాని నరేంద్ర మోడీ ముచ్చటగా మూడవసారి కేంద్రంలో అధికారం లోకి రావడం ఖాయమని ఆయన అన్నారు.దేశం అభివృద్ధి చెందటాంటే ప్రధాని నరేంద్ర మోడీ సాధ్యమని అన్నారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలతో దేశ ప్రజలు మరోసారి ప్రధానిగా నరేంద్ర మోడీకే భారీ మెజార్టీ ఇవ్వబోతున్నారని ఆయన అన్నారు.ఉగ్రవాదం, దేశ రక్షణ, అంతర్గత భద్రతకు బిజెపి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు.మెదక్ ఎంపీగామాధ వనేని రఘునందన్‌రావు భారీ మెజార్టీతో గెలువబోతున్నారని ఆయన అన్నారు.

# గజవాడ నాగరాజుపై జరిగిన దాడి బాధాకరం

## ఈ దాడికి కాంగ్రెస్‌కు సంబంధం లేదు : టీపీసీసీ కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, కాంగ్రెస్ నాయకులు

**రామాయంపేట మున్సిపాలిటీ, మే 26, ప్రభాతవార్త ః** రామాయంపేట పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్ గజవాడ నాగరాజుపై శనివారం నాడు జరిగిన దాడి బాధకరమని, దీనిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని, ఈదాడికి కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని టీపీసీసీ కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు అన్నారు. ఆదివారం నాడు ఆయన స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి తన స్వగృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలకు సంభందించిన ఘర్షణకు రాజకీయ రంగు పులిమి, రెండు పార్టీల మధ్య చిచ్చుపెట్టడం సమంజసం కాదన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ మంత్రి హరీష్‌రావులు కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా ఎదురుకోలేక ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన గొడవను రెండు పార్టీల మధ్య చిచ్చుపెట్టి, రెండు కులాల మధ్య చిచ్చుపెట్టి రామాయంపేట గొడవలు సృష్టించాలని చూస్తున్నారన్నారు. దీనిని రామాయంపేట ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. నిన్న జరిగిన దాడి సమయంలో కాంగ్రెస్ నాయకుల పైన కూడా పెట్రోల్ పడిందని, అందరూ కూడా గజవాడ నాగరాజు పిలిస్తేనే అక్కడికి వెళ్లారని తెలిపారు. కావున కాంగ్రెస్ పార్టీ నాయకుల పైన తిరుపతిరెడ్డి చేసిన ఆరోపణలను వెనక్కు తీసుకోవాలని, లేదంటే రామాయంపేటలో తిరుపతిరెడ్డిని తిరగనివ్వమని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ఇలాంటి అసాంఘీక చర్యలను ఎప్పుడు సహకరించదన్నారు. గత 20 సంవత్సరాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎలాంటి లిటికేషన్లలో పోలేదని, రామాయంపేటలో అన్ని సమస్యలకు కారణం బీఆర్ఎస్ నాయకులే అని, ఇది ప్రజలందరికీ తెలుసునని తెలిపారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ చిలుక గంగాధర్, సీనియర్ నాయకులు దోమకొండ యాదగిరి, ఎనిశెట్టి అశోక్, బిసి సెల్ పట్టణ అధ్యక్షులు చింతల స్వామి, మండల నాయకులు కుమార్ సాగర్, రేవెల్లి వినయ్‌సాగర్, విప్లవ్ కుమార్, బైరామ్ కుమార్, చింతల నరేష్, తోట కిరణ్, ఎనిశెట్టి సంతోష్, చిలుక విరాట్, జీడిపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


బందారంలో మహంకాళమ్మకు బోనాలు తీస్తున్న దృశ్యం

## బందారంలో ఘనంగా బోనాల పండుగ

**కొండపాక, మే 26, ప్రభాతవార్త** మండల పరిధిలోని బందారంలో గ్రామ దేవతల బోనాల పండుగలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అదివారం మహంకాళమ్మ ప్రథమ వార్షికోత్స వం సందర్భంగా గ్రామంలోని అన్ని కులాల వారు మహంకాళమ్మ, పోచమ్మలకు బోనాలు సమర్పించుకున్నారు. అదే విధంగా ముద్దిరాజ్‌ల కుల దైవం ఐనా పెద్దమ్మతల్లి ఎడవ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నారు అందులో భాగంగా అమ్మవారి కళ్యాణం నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర వ్రహిస్తామని నిర్వహకులు తెలిపారు. సాయంత్రం గౌడ సంఘం అధ్వర్యంలో ఎల్లమ్మ తల్లికి బోనాలు నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం బోద్రయికి నీళ్ళు పోయ్యడం, సాయంత్రం దుర్గమ్మతల్లికి బోనాలు సమరి ్పంచడం, అనంతరం దుబ్బుల వాళ్ళతో కొలువు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అన్ని కుల సంఘంల పెద్దలు, గ్రామస్తులు, యువకులు, మహిళలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్న దృశ్యం

**కొండపాక, మే 26, ప్రభాతవార్త** కుకునూరుపల్లి ఉన్నత పాఠశాల 10వ తరగతి పూర్వ విద్యార్థుల (1999-2000 బ్యాచ్) అత్మీయ సమ్మేలనం అదివారం రిమ్మనగూడ ఎస్4 హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు 10వ తరగతి పూర్తి చేసుకొని 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సిల్వర్ జూబ్లి కార్యక్రమం నిర్వహించారు. త సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు అత్మీయంగా పలకరించుకున్నారు. చాలా సంవత్సరాల తర్వాత అందరం కలుసుకొడం సంతోషంగా ఉందన్నారు. చదువుకున్నప్పటి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, యూసుఫ్, పద్మశ్రీ, తహెర్‌ఖాన్, జయరాంరెడ్డి, హరిచంద్రారెడ్డి, నాగేంద్రంలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో షకిల్‌పాషా, మహిపాల్‌రెడ్డి, లత, దబ్బెట క్రిష్ణ, భద్రయ్య, రవి, స్వామి, నర్సింలు, కనకయ్య, సరిత, సభిత, స్వప్న, చంద్రం, చందు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కన్నతల్లి దండ్రుల ఆలయాల ప్రథమ వార్షికోత్సవం

**నర్సాపూర్ మే, 26. ప్రభాతవార్త :** నర్సాపూర్ మండల పరిధిలోని రుస్తుంపేట గ్రామంలో గల డాక్టర్ దండెపు బస్వానందం ఆశ్రమంలో ఆదివారం శ్రీసంతాన నాగదేవతా, శ్రీ పోచమ్మ దేవతా ఆలయాల ఆరవ వార్సికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.అదేవిదంగా డాక్టర్ బస్వానందం తల్లిదండ్రులు దండెపు పెంటమ్మ ఈశ్వరప్పల ఆలయ ప్రథమ వార్షికోత్స వాన్ని కూడ భక్తి శ్రద్ధలతో నియమ నిష్టలతో నిర్వహించారు. ప్రముఖ హోమియోపతి డాక్టర్ దండెపు బస్వానందం దంపతుల అధ్వర్యంలో ఈ వార్షికోత్స వాల సందర్భంగా ఈఆలయాల్లో గణపతిహోమం, రుద్రాభిషేకం ,కుంకుమార్చనలు అంగరంగ వైభోవోపేతంగా జరిగాయిఈసందర్భంగా గౌరవ అతిథులుగా హాజరైన బర్ధీపూర్ ఆశ్రమ ఫీఠాధిపతి శ్రీగిరిమహారాజ్‌స్వామి, రుస్తుంపేట ఆత్మానందాశ్రమ ఫీఠాధిపతి శ్రీ రాజయోగి వెంకటస్వామి లు మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన కలిగి ప్రతి ఒక్కరు భక్తి భావన కలిగి ఉండాలన్నారు. ఆ భగవంతుని నామస్మరణ చేయడంవల్ల ముక్తి దొరుకుతుందన్నారు. ఈవార్షికోత్స వాలలో ఆలయాలకు వార్షికోత్స వాలు చేయడం ఆనవాయితీ కాగా ప్రముఖ హోమియోపతి డాక్టర్ దండెపు బస్వానందం తన కన్నతల్లిదండ్రులకు ఆలయాన్ని నిర్మించి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో శుభపరిణామమన్నారు.తల్లిదండ్రులకు చేసిన సేవా పరమాత్మునికి అందుతుందని శాస్త్రాలు చెబుతున్నాయని తెలిపారు. ఈమేరకు ప్రముఖ హోమియోపతి డాక్టర్ దండెపు బస్వానందం ధన్యజీవి అని పేర్కొన్నారు.ఈ మేరకు ప్రతి ఒక్కరు కూడా తమ తల్లి దండ్రులను ప్రేమగా చూసుకొని జీవితంలో ముక్తి పొందాలని వారు పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించగా భక్తులు, ప్రజలుఅన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. డాక్టర్ బస్వానందం తల్లిదండ్రులు దండెపుపెంటమ్మ ఈశ్వరప్ప ల ఆలయ ప్రథమ వార్షికోప్స వ కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. ఈ మేరకు రుస్తుంపేటలో జరిగిన ఆలయాల వార్షికోత్స వాలకు పరిసరా గ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో తరిలివచ్చి దైవ కృపకు పాత్రులయ్యారు.ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రముఖ హోమియోపతి డాక్టర్ దండెపు బస్వానందం హాజరైన భక్తులందరికి కృతజ్ఞతలు తెలియజేశారు.


గణపతి హోమం నిర్వహిస్తున్న దండెపు బస్వానందం దంపతులు


గజగట్లపల్లిలో బావిలో పడిని ట్రాక్టర్

## బావిలో పడిన ట్రాక్టర్.... చోదకుడి పరిస్థితి విషమం

**చిన్నశంకరంపేట,మే26,ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట మండలం గజగట్లపల్లి గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బావిలో పడి చోదకుడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం నార్సింగ్‌కు చెందిన వెంకటేష్ గ్రామాంలోని రైతు వద్ద ఉన్న కల్టివేటర్‌ను తీసుకోని వెల్లడానికి తన ట్రాక్టర్‌ను తీసుకోని వాచ్చాడు. వ్యవసాయ పోలాల వద్ద నుండి వెలుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బావిలో పడింది. చోదకుడు వెంకటేష్ కేకలు వేయడంతో గమనించిన రైతులు బావిలోకి దిగి అతడిని అతికష్టం మీద బయటకు తీశారు. బావిలోతు సుమారు 20అడుగులు ఉంటుందని, నీల్లు ఉండి ఉంటే వెంకటేష్ మరనించి ఉండేవాడని రైతులు తెలిపారు. కుటుంబ సభ్యులు భాగ్యనగరంలోని ప్రవేటు ఆసుపత్రికి తరలించారని, అతని పరిస్థితి విషమంగా ఉందని వారు తెలిపారు.

## డీసీఎంలోని గడ్డికి మంటలు... అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది


మదూరులో మంటలను అదుపులోకి తెస్తున్న అగ్నిమాపక సిబ్బంది

**చిన్నశంకరంపేట,మే26,ప్రభాతవార్త:** మండల పరిధి మదూరులో ఆదివారం ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగలు తగిలి డీసీఎంలోని గడ్డికి మంటలు వ్యాపించాయి. అంబాజిపేటకు చెందిన నర్సింలు మదురూ రైతుల వద్ద నుండి గడ్డిని సేకరించి తన డీసీఎంలో తరలిస్తున్నాడు. ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగలు గడ్డికి తగిలి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. గమనించిన రైతులు వెంటనే రామాయంపేట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు వచ్చి మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. సుమారు 1లక్ష రూపాయాల నష్టం వాటిలిందని నర్సింలు వాపోయాడు.

## కరాటేలో నర్సాపూర్‌విద్యార్థుల ప్రతిభ


అర్హత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందజేస్తున్న దృశ్యం

**నర్సాపూర్ మే, 26. ప్రభాతవార్త :** నర్సాపూర్ పట్టణంలోని చిల్డ్రన్స్ పార్క్‌లో స్థానిక సీనియర్ కరాటే మాస్టర్ గుర్రాల అశోక్ అధ్వర్యంలో జిల్లా స్థాయి కరాటే పోటీలు పరీక్షలు నిర్వహించారు. ఈపోటీలు వివిద విభాగాలో నర్సాపూర్ ,రాయిలాపూర్, వెంకట్రావ్‌పేట, రుస్తుంపేట, కౌడిపల్లి, కొల్చారం ,దౌల్తాబాద్ విధ్యార్తులు పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. ఈకరాటే పరీక్షలకు ఎగ్జామినర్‌గా రెంజుకి చోటా ఖాన్ కరాటే క్లబ్ అప్ఇండియా ఫౌండర్ అండ్ డైరక్టర్ నాగేశ్, అసిస్టెంట్ ఎగ్జామినర్ భూపాల్, ప్రసన్నకుమార్, శ్రీశైలం లు వ్యవహరించారు. అంతేగాక ఈ కరాటే పోటీల పరీక్షలకు ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ నర్సాపూర్‌నియోజకవర్గ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయలుగౌడ్,టిపిసిసి రాష్ట్ర నాయకులు కరుణాకర్‌రెడ్డి, సుహాసినిరెడ్డి,వెంకట్‌రెడ్డి, నవీన్‌గుప్త, వేణుగోపాల్‌రెడ్డి లు జరయ్యారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయలుగౌడ్ మాట్లాడుతూ యువత ఆరోగ్యగంగా ఉండాలంటే కరాటే ఎంతో అవసరమని అన్నారు.కాంగ్రెస్ నర్సాపూర్‌నియోజకవర్గ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ కరాటే వల్ల క్రమశిక్షణ, ఆత్మ స్థైర్యం పెరుగుతుందన్నారు.,టిపిసిసి రాష్ట్ర నాయకురాలు సుహాసిని రెడ్డి మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అరాచకాలను ఎదుర్కొవాలంటే బాలికలకు కరాటే ఎంతగానో ఉపయోగ పడుతుందని అన్నారు.ఈ మేరకు స్థానిక కరాటే మాస్టర్ గుర్రాల అశోక్ అధ్వర్యంలో కరటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ లో అర్హత సాధించిన విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా సర్టిపికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జ్యోతి సురేశ్‌నాయక్,మాజీ జడ్పి టిసీ శ్రీనివాస్‌గుప్త, మాజీ ఎంపిపి శ్రీనివాస్‌గౌడ్,నాయకులు నవీన్‌గుప్త, గంగాధర్,వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మండల ఓబిసి సెల అధ్యక్షులు రెడ్డిపల్లి అశోక్‌గౌడ్,మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు అజ్మత్,యూత్ కాంగ్రెస్ నాయకులు నర్సింహ్మాచారి, దేవిసింగ్, మోహన్‌దాస్ పాల్గొన్నారు.

## మంజీరా డ్యాంలో ఇరువురు యువకుల మృతి

**నంగారెడ్డి టౌన్, మే 26, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణ శివారులోని మంజీర డ్యాంలో ఇద్దరు యువకులు మృత్యువాడ పడ్డారు. ఇస్మా యిల్ ఖాన్ పేట్‌కు చెందిన మహ్మద్ అశ్రఫ్ (16), మహ్మద ఆరీఫ్ (16)లు చెక్‌డ్యాంలో విగత జీవులుగా కానవచ్చారు. యవకుల మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.




ఆత్మీయ సమ్మేళనం దృశ్యం

## గౌరవెల్లిలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**అక్కన్నపేట,మే26,ప్రభాతవార్త** మండలంలోని గౌరవెల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు.ఈ సందర్భంగా వారికి విద్యా బుద్దులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.అనంతరం విద్యార్థులు తమ చిన్న నాటి చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లారెడ్డి, మోహన్‌రావు, లక్ష్మీనారాయణ, నారాయణరెడ్డి, రాజేశం, లక్ష్మారెడ్డి, కనుకయ్య, శంకర్, వెంకట్‌రెడ్డి, శకుంతల, శ్రీనివాస్, లింగారెడ్డి, మోహన్, శ్రీనివాస్, సంపత్, పరమేష్, విజయ్‌కుమార్‌తో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## స్థానికేతరుల పాలన వల్లే అభివృద్ధికి నోచుకోని ఎల్లమ్మ దేవాలమం

### బిజెపి కార్యవర్గ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి


ఎల్లమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తున్న జెఎస్ఆర్

**హుస్నాబాద్,మే26,ప్రభాతవార్త** దక్షణ భారతదేశంలోనే గొప్పగా జరిగే జాతర శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి జాతర అని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రోజున ఎల్లమ్మతల్లిని దర్శించుకున్న ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం మాట్లాడుతూ ఇంత గొప్ప మహిమ గల దేవాలయం హుస్నాబాద్‌లో ఉండడం ఈ ప్రాంత ప్రజల అదృష్టంగా భావిస్తున్నామన్నారు.ఈ ప్రాంత ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.మహిమ గల గొప్ప అమ్మవారి దేవాలయం స్థానికేతరుల పాలన వల్లే అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతీ సంవత్సరం మే నుండి జూన్ అంటే నెల రోజుల వరకు జరిగే ఈ దేవాలయంలో భక్తులకు కనీస సౌకర్యాలు లేవడం బాదాకరమైన విషయమన్నారు.రానున్న రోజుల్లో ఆలయ అభివృద్ధికి కేంద్రం నుండి నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు.అంతే కాకుండా దేవాలయానికి తన సహకారం ఎప్పటికీ అందిస్తానని హామీ ఇచ్చారు.

## బెల్లి లలితక్క విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలి

### జాయింట్ యాక్షన్ కమిటీ నియోజకవర్గ కో కన్వినర్ వీరన్న యాదవ్


బెల్లి లలితక్క చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జెఏసి నాయకులు

**హుస్నాబాద్,మే26,ప్రభాతవార్త** బెల్లి లలితక్క విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని హుస్నాబాద్ జాయింట్ యాక్షన్ కమిటి నియోజకవర్గ కోకన్వినర్ మ్యాకల వీరన్న యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం లలితక్క 25వ వర్ధంతి కార్యక్రమాన్ని మండలంలోని మీర్జాపూర్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ మలి దశ ఉద్యమంలో ఉద్యమ వ్యతిరేకులు బెల్లి లితక్కను 17 ముక్కలుగా నిరికి గోనె సంచిలో కట్టి చెరువుకుంటలో పడేసిన విషయాన్ని గుర్తు చేశారు.కార్మికురాలిగా పని చేసిన లలితక్క కార్మిక,మహిళా సమస్యలపై ఎన్నో పోరాటాలు నిర్వహించిందని,ఫ్లోరైట్ సమస్యపై ప్రజలను చైతన్యం చేయడంతో పాటు వైశ్య వృత్తిలో ఉన్న మహిళలను ఆనరకం నుండి విడిపించిందన్నారు.తెలంగాణ జనసభ ఆధ్వర్యంలో తెలంగాణ కళాసమితికి కోకన్వినర్‌గా ఉండి ఉధ్యమాలు నిర్వహించిన విషయాలను గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో జెఎసి బాద్యులు ఇల్లందుల లక్ష్మణ్‌గౌడ్,గొర్ల వీరన్నయాదవ్,నరసింహ,రమేష్,సంపత్,శ్రీనివాస్,దిలీప్ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పూర్వ విద్యార్థుల సమ్మేళనం దృశ్యం

**హుస్నాబాద్,మే26,ప్రభాతవార్త** హుస్నాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993-94 సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.ఈ సందర్భంగా 10వ తరగతి పూర్తయి 30ఏండ్లు పూర్తయిన వేళ ఈ వేడుకలు నిర్వహించుకుంటున్నామన్నారు.ఈ వేడుకల్లో వారికి విద్యా బుద్దులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.మరణించిన వారి స్నేహితులకు శ్రద్దాం జలి ఘటించారు.అనంతరం తమ చిన్ననాటి స్నేహితులు చదువుకున్న రోజుల్లో చేసిన చిలిపి చేష్టలు గుర్తు చేసుకున్నారు.ఈ వేడుకల్లో స్నేహితులు కష్ట సుఖాల్లో ఉంటే అందరూ ఒక్కటై సహకారం అందిచుకోవాలని తీర్మానించుకున్నారు.

## నూతన మున్సిఫల్ భవననిర్మాణ పనుల పరిశీలన

**నర్సాపూర్ మే, 26. ప్రభాతవార్త :** నర్సాపూర్ పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న మున్సిఫల్ భవన నిర్మాణం పనులు జరుగుతున్నాయి ఈమేరకు ఆదివారం నర్సాపూర్ మున్సిఫల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్ నూతన మున్సిఫల్ భవన నిర్మాణణ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా నిర్మాణం జరిగిన గదులన్ని కలియ తిరిగి ఈ పనులు ఎంత వరకు పూర్తయ్యాయి అన్ని వివరాలు నిర్మాణం చేస్తున్న కాంట్రాక్టర్ నవీన్‌రావు ను అడిగి తెలుసుకున్నారు. ఈ భవన నిర్మాణ పనులు నాణ్యతగా ఉండాలని సూచించారు. అంతేగాక నూతనంగా నిర్మిస్తున్న పనులు పూర్తయ్యే దశకు చేరుకోగా త్వరితగతిన మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్ నవీన్‌రావుకు సూచించారు. ఈకార్యక్రమంలో మున్సిఫల్ చైర్మన్ అశోక్‌గౌడ్ తో పాటు కౌన్సిలర్‌లు పంబళ్ళ రాంచందర్, సంగసాని సురేశ్, నాయకులు పంబళ్ళ బిక్షపతి,దావూద్, ఆంజనేయలుగౌడ్ పాల్గొన్నారు.



